సాక్షి ఖమ్మం

శనివారం ı 13 ı జనవరి ı 2024



జైళ్ల శాఖ డీఐజీ విచారణ

అత్యాచారం, హత్య కేసులో నిందితుడి పుట్టినతేదీ ధ్రువీకరణ కోసం జైళ్ల శాఖ వరంగల్ డీఐజీ విచారణ చేపట్టారు. 10లో



లక్ష్యసాధనలో మేటి కిష్టారం

సత్తుపల్లి మండలం కిష్టారంలోని ఓసీ సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ముందుగానే చేరుకుంది. 12లో

గరిష్టం / కనిష్టం

32° / 18°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ప్రణాళికాయుతంగా బడ్జెట్ రూపకల్పన



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: రానున్న ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపాలిటీల బడ్జెట్‌ను ప్రణాళికాయుతంగా రూపొందించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. వేతనాలు, విద్యుత్ బిల్లులు, సీసీ చార్జీలు, రుణాల చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వాలని, విలీన గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందించే గ్రాంట్‌కు తోడు వంద శాతం పన్నులు వసూలుచేయాలని తెలిపారు. అలాగే, వేసవిలో తాగునీటి సమస్య ఎదురు కాకుండా ముందుస్తు ఏర్పాట్లుచేయాలన్నారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు సుజాత, రమాదేవి, కరుణాకర్ రెడ్డి, కేఎంసీ ఈఈ కృష్ణలాల్, జేఏఓలు శివలింగం, ప్రసాద్ పాల్గొన్నారు.

నేటితో డేటా ఎంట్రీ పూర్తి



ఉద్యోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

నేలకొండపల్లి: ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చివరి దశకు చేరిందని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 4,88,316 దరఖాస్తులు అందగా, ఇప్పటి వరకు 92 శాతం నమోదు పూర్తయిందని తెలిపారు. శనివారం నాటికి లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు. దరఖాస్తులను గడువు కంటే ముందు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అధికారులు, సిబ్బంది కృషిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ అరుణాబాయి, వివిధ శాఖల ఉద్యోగులు రమణ, సీ.హెచ్.శివ, మధుసూదన్‌రావు, సునీత, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే లక్ష్యసాధన



వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: యువతీ యువకులు ఏకాగ్రతతో ముందుకు సాగితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతోత్సవాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో యువత తమ నడవడికను మార్చుకుని లక్ష్యసాధన కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని యువజన సంఘాల ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమాల్లో విజేతలకు, జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఆతర్వాత స్వచ్ఛభారత్‌లో భాగంగా డీవైఎస్ఓ ఆధ్వర్యాన స్టేడియంలో చెత్తాచెదారం తొలగించారు. శాప్ కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి, పరిపూర్ణాచారితో పాటు బండారుపల్లి లక్ష్మయ్య, పాపయ్య, సుధీర్ పాల్గొన్నారు. కాగా, రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో రెండో స్థానంలో నిలిచి జిల్లా జట్టు సభ్యులను డీవైఎస్ఓ అభినందించారు.

ఇద్దరు కేఎంసీ డీఈల బదిలీ

- మాతృశాఖకు డిప్యూటీ కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇద్దరు డీఈలను శుక్రవారం బదిలీ చేశారు. డీఈ రంగారావు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు, స్వరూపారాణి నిర్మల్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. అలాగే, డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరిని మాతృశాఖ అయిన పంచాయతీరాజ్‌కు సరెండర్ చేశారు.

సెలవులో వెళ్లినట్లు ప్రచారం

కేఎంసీ డిప్యూటీ కమిషనర్, ఇద్దరు డీఈలు సెలవులో వెళ్లినట్లు తొలుత ప్రచారం జరిగింది. డిప్యూటేషన్‌పై వచ్చి గత పాలకులకు అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలు రాగా, వారిని ఇక్కడి నుంచి పంపించాలని నిర్ణయించినట్లు సమాచారం. తొలుత సెలవుపై వెళ్లేలా ఆదేశించాలని కమిషనర్‌కు సూచనలు రావడంతో వారు సెలవులో వెళ్లినట్లు ప్రచారం జరిగింది. అయితే, శుక్రవారం సాయంత్రానికి డీఈల బదిలీ, డీసీ సరెండర్ ఉత్తర్వులు వెలువడ్డాయి.



అవిశ్వాసం

మళ్లీ మున్సిపాలిటీలపై చర్చ

- బీఆర్‌ఎస్ చేతిలోనే మూడు మున్సిపాలిటీలు
- వైరా మినహా మిగతాచోట్ల రాజకీయ ఉత్కంఠ
- ఖమ్మం కార్పొరేషన్‌పైనా ఊహాగానాలు
- డీసీసీబీ చైర్మన్ కూరాకులపై నోటీసులతో కలకలం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకున్న నేపథ్యాన 'అవిశ్వాసం' చర్చకు వస్తోంది. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పీఏసీఎస్ చైర్మన్ నాగభూషణంపై పీఏసీఎస్ డైరెక్టర్లు అవిశ్వాస నోటీసులు ఇచ్చిన నేపథ్యాన మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి ఎదురవుతుందని భావిస్తున్నారు. జిల్లాలో సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు ఉండగా.. ఈ మూడు కూడా ఇప్పటికైతే బీఆర్‌ఎస్ చేతిలోనే ఉన్నాయి. అయితే ఎన్నికలకు ముందు వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట కాంగ్రెస్‌లో చేరారు. గతంలోనే జైపాల్‌పై బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన నోటీసు కలెక్టర్‌కు అందజేశారు. ఇక సత్తుపల్లి, మధిరలో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఉన్నా.. పలువురు కౌన్సిలర్లు పార్టీ మారతారనే ప్రచారం జరుగుతోంది. ఖమ్మం కార్పొరేషన్‌లోనూ అవిశ్వాసం తప్పదన్న ఊహాగానాలతో రాజకీయ ఉత్కంఠ నెలకొంది.

ఊహించని పరిణామంతో..

అవిశ్వాస తీర్మానాలపై చర్చ కొన్నాళ్లుగా జరుగుతున్నా, ఎవరూ ఊహించని విధంగా వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ నాగభూషణంపై డైరెక్టర్లు గురువారం అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చారు. పీఏసీఎస్ చైర్మన్‌గా ఆయన తొలగితే డీసీసీబీ చైర్మన్‌గానూ అర్హత కోల్పోతారనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో మున్సిపాలిటీల్లోనూ ఇదే వ్యూహాన్ని అమలు చేస్తారా.. లేకపోతే కౌన్సిలర్లను ఆకట్టుకునే యత్నాలు జరుగుతాయా అన్నది తేలాల్సి ఉంది. మరోవైపు వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్ కాంగ్రెస్‌లోనే ఉండడం,. మధిర, సత్తుపల్లిలో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఉన్నందున ఇప్పటికిప్పుడే నిర్ణయం తీసుకోరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వైరాలో గతంలోనే...

వైరా మున్సిపల్ చైర్మన్‌పై ఎన్నికలకు ముందే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసులు ఇచ్చారు. ఇక్కడ బీఆర్‌ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు, కాంగ్రెస్‌కు ఇద్దరు, సీపీఎం, స్వతంత్రులు ఒక్కొక్కరు ఉన్నారు. కాగా, ఎన్నికల సమయాన పలువురు పార్టీ మారడంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు పది మంది చొప్పున కౌన్సిలర్ల బలం సమకూరింది. మరికొందరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఫలితంగా ప్రస్తుత చైర్మన్ జైపాలే కొనసాగడం ఖాయంగా తెలుస్తోంది.

సత్తుపల్లిలో బలంగా..

సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో 23 వార్డులను బీఆర్‌ఎస్ గెలుచుకుంది. అయితే ఎన్నికలకు ముందు ఐదుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా బీఆర్‌ఎస్‌కు 18మంది కౌన్సిలర్లు మిగిలారు. వైస్ చైర్మన్‌గా ఉన్న తోట సుజలారాణి సైతం కాంగ్రెస్‌లో చేరారు. అయినా సత్తుపల్లి మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ బలంగా ఉన్నప్పటికీ ఇక్కడ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే ఎక్కువ మంది కౌన్సిలర్లను కాంగ్రెస్ ఆకర్షించక తప్పదని చెబుతున్నారు.

మధిరలోనూ బీఆర్‌ఎస్ మెజార్టీ..

మధిర మున్సిపాలిటీలో 22 వార్డులకు గాను బీఆర్‌ఎస్ నుంచి 15మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, టీడీపీ నుంచి ముగ్గురు, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కొక్కరు గెలుపొందారు. స్వతంత్ర కౌన్సిలర్ గద్దల మాధురి గతంలోనే బీఆర్‌ఎస్‌లో చేరగా, ఎన్నికల సమాయన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎర్రగుంట లక్ష్మి, మొండితోక నాగరాణి కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఇక 20వ వార్డు కౌన్సిలర్ ముత్తవరపు రాణి అనారోగ్యంతో మృతి చెందడం, ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ బలం 13కు తగ్గగా కాంగ్రెస్‌కు నలుగురు ఉన్నారు. టీడీపీకి చెందిన ముగ్గురితో పాటు సీపీఎం కౌన్సిలర్‌ను కలుపుకున్నా బలం ఎనిమిదికే చేరుతుంది. ఇక్కడ కూడా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను ఆకర్షిస్తేనే అవిశ్వాస తీర్మానం పనిచేస్తుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికిప్పుడు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానానికి పావులు కదపకపోయినప్పటికీ.. పరిస్థితిని అంచనా వేస్తూ ముందుకు వెళ్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఖమ్మంపై ఇదే చర్చ..

ఖమ్మం కార్పొరేషన్‌లో గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించింది. మేయర్‌గా పునుకొల్లు నీరజ ఉన్నారు. ఎన్నికల ముందు కొందరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరినా.. మెజార్టీ కార్పొరేటర్లు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. అయితే ముున్ముందు కాంగ్రెస్ పార్టీలో మరికొందరు చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యాన కేఎంసీపై కూడా కాంగ్రెస్ అవిశ్వాసం పెడుతుందన్న రాజకీయ చర్చ మొదలైంది. మెజార్టీ కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు వచ్చాకే అవిశ్వాసం తీర్మానానికి మొగ్గు చూపొచ్చని తెలుస్తోంది.

27న వీ.వీ.పాలెం సొసైటీ చైర్మన్‌కు బలపరీక్ష

- క్యాంప్‌నకు బయలుదేరిన డైరెక్టర్లు



వీ.వీ.పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ కూరాకుల నాగభూషణంపై అవిశ్వాసానికి అడుగులు పడుతున్నాయి. ఆయన డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతుండగా... పీఏసీఎస్ చైర్మన్ కుర్చీ నుంచి దింపేలా 13మందికి గాను 11మంది డైరెక్టర్లు గురువారం డీసీఓకు అవిశ్వాస తీర్మానం అందజేశారు. ఈ తీర్మానంపై చర్చించేందుకు పదిహేను రోజుల గడువు ఉన్న నేపథ్యాన ఈనెల 27న ఉదయం 10 గంటలకు పీఏసీఎస్‌లో జరిగే సమావేశానికి హాజరుకావాలని డైరెక్టర్లుకు సమాచారం ఇచ్చారు. దీంతో 11 మంది డైరెక్టర్లును కాంగ్రెస్ నాయకుడు రావూరి సైదబాబు ఆధ్వర్యాన శుక్రవారం క్యాంపునకు తరలించారు. జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరాన ఒక నేత ఫామ్ హౌస్‌కు వీరిని తీసుకెళ్లగా, సమావేశానికి మరో పదిహేను రోజుల సమయం ఉన్నందున విహార యాత్రకు తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

62ఏళ్లలో తొలిసారి ఏకగ్రీవం..అవిశ్వాసం

వీ.వీ.పాలెం సహకార సంఘం ఏర్పాటైన 62 ఏళ్లలో ఇప్పటి వరకు కూరాకుల నాగభూషణం మాత్రమే ఏకగ్రీవంగా చైర్మన్‌గా నిలిచారు. ఆయనకు డీసీసీబీ చైర్మన్‌గా అవకాశం దక్కినప్పటికీ నాలుగేళ్లకే అవిశ్వాసం ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో ఏకగ్రీవ ఎన్నిక.. అవిశ్వాసం రెండూ ఆయనకే ఎదురుకావడం గమనార్హం. 1962 ఏడాదిలో వీ.వీ.పాలెం సహకార సంఘం 2469టీయూ పేరుతో రిజిస్ట్రేషన్‌తో ఏర్పాటు కాగా, 2005లో వేపకుంట్ల, అల్లీపురం సంఘాలను వీ.వీ.పాలెం సంఘంలో విలీనం చేశారు. ప్రస్తుతం రూ.22కోట్ల టర్నోవర్ కలిగిన ఈ సంఘంలో ఐదు వేల మంది సభ్యులు ఉండగా, 4,400 మంది వివిధ రకాల రుణాలు తీసుకున్నారు.

మిర్చి రైతులు నష్టపోవద్దు..



మార్కెట్‌లో మిర్చిని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- పంట కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు
- మార్కెట్లలో అదనంగా ఉద్యోగుల ఏర్పాటు
- ఖమ్మం మార్కెట్‌లో పరిశీలించిన మంత్రి తుమ్మల
- ఉన్నతాధికారులకు దిశానిర్దేశం



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి

ఖమ్మంవ్యవసాయం: మిర్చి పండించిన రైతులు పంట అమ్ముకునే సమయాన నష్టపోకుండా పకడ్బందీ ప్రణాళిక రూపొందించి అమలు చేయనున్నారు. దేశ, విదేశాల్లో పంటకు డిమాండ్ ఉన్నా విక్రయాలు పెరిగేకొద్దీ ధర తగ్గడం ఆనవాయితీగా మారింది. ఇటీవల మిర్చి ధర పతనంపై ఖమ్మం, వరంగల్ వ్యవసాయ మార్కెట్లలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యాన ప్రభుత్వం రంగంలోకి దిగింది. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో మార్కెటింగ్ శాఖతో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు వారు గురు, శుక్రవారాల్లో జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖమ్మం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లను పరిశీలిస్తుండగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా వచ్చి రైతులతో మాట్లాడారు. మిర్చి ధరలో తరచుగా తేడాలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా అధికారులతో మంత్రి సమావేశమై పలు సూచనలు చేశారు.

ప్రత్యేక బృందాలు, అదనపు సిబ్బంది

ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి శాంపిళ్లను అధికారులు మంత్రి తుమ్మలకు చూపించి ధరలను వివరించారు. జెండా పాట ధరతో పోలిస్తే విక్రయాల ధరల్లో వ్యత్యాసాలు ఉంటున్నాయనే అంశంపై చర్చించారు. ధరలో తేడా ఎక్కువగా ఉంటే రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కాగా, డిసెంబర్‌లో కురిసిన వర్షాల కారణంగా మిర్చి నాణ్యత కోల్పోయి తాలు శాతం పెరిగిందని.. ఇది ధరపై ప్రభావం చూపుతోందని చెప్పారు. అయితే, మిర్చి కొనుగోళ్లను పర్యవేక్షించేలా ప్రత్యేక బృందాలను నియమించి ధరలో వ్యత్యాసం రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అలాగే, పంట సీజన్‌లో అదనంగా ఉద్యోగులను నియమించి దళారులు, లైసెన్సులు లేని వారు రాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, డీడీ శ్రీనివాస్, ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్త టి.సురేష్, ఉద్యాన, వ్యవసాయ శాఖల డీడీలు వేణుగోపాల్, ఎస్.మోహన్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు రవి, శైలజ, డీఏఓ ఎం.విజయనిర్మల, ఖమ్మం ఉద్యాన శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ.రమణ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై మంత్రి అసహనం

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో కొత్తగా నిర్మించిన షెడ్డులో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నిలిపి ఉండడాన్ని మంత్రి తుమ్మల గుర్తించారు. ఈ షెడ్డు పార్కింగ్ కోసం నిర్మించారా, పంట ఉత్పత్తుల నిల్వకు నిర్మించారా అని మార్కెటింగ్ శాఖ అధికారులను అడగగా వారు సమాధానం ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఆతర్వాత మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి మాట్లాడుతూ త్వరలోనే ఖమ్మం మార్కెట్‌కు ఉన్నత శ్రేణి కార్యదర్శిని నియమించటంతో పాటు మార్కెట్ నిర్వహణకు సరిపడా ఉద్యోగులను కేటాయిస్తామని తెలిపారు. అలాగే, మిర్చి ధర స్థిరంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

కనుల పండువగా కూడారై ఉత్సవం

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. ధనుర్మాసోత్సవాల్లో 27వ రోజు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గోదాదేవి అమ్మవారికి శ్రీరంగనాథునితో వివాహం జరిగితే 108గంగాళాలతో పాయసం నివేదన చేస్తానన్న మొక్కును తీర్చారని ప్రతీతి. స్వామితో పాటు గోదాదేవి అమ్మవారిని బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ద్రవిడ ప్రబంధాలతోపాటు పాయసాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డబ్బులు ఇస్తేనే బోర్లకు అనుమతి

- జెడ్పీ సమావేశంలో సభ్యుల ఆరోపణ
- హాజరైన ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్
- అందరికీ న్యాయం జరగాలన్న చైర్మన్ కమల్‌రాజ్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, పక్కన ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్

ఖమ్మం సహకారనగర్: పోడు భూములకు గత ప్రభుత్వం పట్టాలు ఇచ్చి రైతులకు సర్వహక్కులు ఉంటాయని చెప్పగా బోర్లు వేసేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని కారేపల్లి జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, ఎంపీపీ మాలోతు శకుంతల తదితరులు పేర్కొన్నారు. ఇదేసమయాన డబ్బులు ఇచ్చిన వారు బోర్లు వేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాల్‌లో జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన శుక్రవారం జరగగా పలువురు సభ్యులు ఈ ఆరోపణలు చేశారు. తొలుత కొణిజర్ల జెడ్పీటీసీ పోట్ల కవిత మాట్లాడుతూ పోడు భూములు సాగు చేసుకుంటున్న వారు గిరివికాసం కింద బోర్లు వేసుకునేలా అవకాశం కల్పించాలని కోరినా అధికారులు అనుమతించడం లేదన్నారు. దీనిపై ఎఫ్‌డీఓ బాబు స్పందిస్తూ పోడు భూముల్లో బోర్లు వేసేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అయితే, కారేపల్లి జెడ్పీటీసీ జగన్ మాట్లాడుతూ కొందరు అధికారులు డబ్బు వసూలు చేసి బోర్లు వేసినా పట్టించుకోవడం లేదని, అనుమతి కోరితే మాత్రం నిరాకరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ముగ్గురిపై చర్యలు తీసుకున్నామని, ఎవరైనా ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఎఫ్‌డీఓ తెలిపారు. ఈ అంశంపై జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

పలు అంశాలపైచర్చ

వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధిపై సమీక్షలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల నివేదిక సమర్పించారు. కారేపల్లి, పెనుబల్లి జెడ్పీటీసీలు జగన్, చెక్కిలాల మోహన్‌రావు, తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ పంటల వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడంతో పలువురు రైతుల ఖాతాల్లో బీమా నగదు కాలేదని తెలిపారు. అలాగే, రైతులకు ఉపయోగపడే జిప్సం అందుబాటులో తీసుకురావాలని కోరగా ముందస్తుగా నగదు చెల్లిస్తేనే జిప్సం తెప్పిస్తామని డీఏఓ తెలిపారు. ముదిగొండ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, చింతకాని జెడ్పీటీసీ తిరుపతి కిషోర్ తదితరులు ధాన్యం క్వింటాకు రూ.500అదనంగా ఇస్తామన్న అంశంపై వివరణ కోరగా... ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని పేర్కొన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్షలో పెనుబల్లి జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు మాట్లాడుతూ తుమ్మల నాగేశ్వరరావు స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఒక్కో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.7లక్షలు కేటాయిస్తే తర్వాత రూ.5లక్షలకు కుదించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికే నిధులు కేటాయించి ఉపాధి హామీ ద్వారా పనులు పూర్తి చేయించాలని కోరారు. పలు పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేరని, నర్సరీల నిర్వహణ భారంగా మారిందని పలువురు వెల్లడించారు. అయితే, నర్సరీల నిర్వహణ రెండేళ్ల తర్వాత గ్రామపంచాయతీలే చూసుకుంటాయని డీఆర్‌డీఓ విద్యాచందన బదులిచ్చారు.

ప్రజల సంక్షేమం కోసం పనిచేద్దాం..

పార్టీలు వేరైనా ప్రజల సంక్షేమానికి అందరం పాటుపడదామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులే అయినందున సమస్యలను పరిష్కరించుకుని మంచి పాలన అందిద్దామని పేర్కొన్నారు. జిల్లాలో అటవీశాఖ, చేపల సొసైటీల సమస్యలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ పోడు రైతుల సమస్యపై త్వరలోనే సమీక్ష చేసుకుని పరిష్కరించుకుందామని తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వివి అప్పారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుప్పకూలిన గ్రంథాలయ భవనం

సెలవు కావడంతో తప్పిన పెను ప్రమాదం

- రూ.25 లక్షల మేరకు ఆస్తి నష్టం
- సందర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరారవు
- శిథిలాల తొలగింపును పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ



కూలిన గ్రంథాలయ భవనం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరం నడిబొడ్డున పెవిలియన్ గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ పురాతన భవనం శుక్రవారం ఉదయం కూలిపోయింది. నిత్యం వందలాది మంది పాఠకులతో రద్దీగా ఉండే ఈ గ్రంథాలయానికి శుక్రవారం సెలవు దినం కావటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఘటనలో దాదాపు రూ.25 లక్షల మేర ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దాదాపు 500 గజాల విస్తీర్ణంలో 1950వ సంవత్సరంలో ఈ భవనాన్ని రెండు భాగాలుగా నిర్మించారు. చైర్మన్ చాంబర్, మహిళలు, పిల్లల రీడింగ్ హాల్, మొదటి అంతస్తులో పత్రిక విభాగాన్ని నిర్వహిస్తున్న భాగం కూలిపోయింది. దీనికి ఆనుకుని ఉన్న ఆఫీసు హాల్, కార్యదర్శి చాంబర్, మరో రెండు గదులు అలాగే ఉన్నాయి. అయితే, ఉదయం 9.50గంటలకు ఘటన జరగగా ఇంకా కార్యాలయ తాళాలు తీయకపోవడంతో ఎవరికీ ఆపద వాటిల్లలేదు.

శిథిలాలు తొలగించండి..

గ్రంథాలయ భవనం కూలిందన్న సమాచారం తెలియగానే నగరంలో పర్యటిస్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేరుకుని శాఖ అధికారులతో మాట్లాడారు. అలాగే, కలెక్టర్ వీపీ.గౌతమ్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అక్కడకు చేరుకున్నారు. రోడ్లు, భవనాలు, మున్సిపాలిటీ, ఇతర శాఖలకు చెందిన యంత్రాంగం, యంత్రాలను వినియోగించి శిథిలాలను తొలగించాలన్న మంత్రి ఆదేశాలతో మూడు జేసీబీలు, రెండు టిప్పర్లు, ట్రాక్టర్లు, సిబ్బంది చేరుకుని పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, కూలిన భవనం పక్కనే మరో భవనానికి ముప్పు రాకుండా శిథిలాలు తొలగించాలన్న కలెక్టర్ సూచనలతో అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అలాగే, భవనం కూలిన నేపథ్యాన గ్రంథాలయ నిర్వహణ వారం పాటు నిలిపివేయాలని గ్రంథాలయ కార్యదర్శి ఏ.మంజువాణికి కలెక్టర్ ఆదేశించారు.

25వేలకు పైగానే పుస్తకాలు

గ్రంథాలయ భవనం కూలిపోవడంతో అందులో ఉన్న దాదాపు 25 వేల పుస్తకాలు, ఫర్నీచర్ ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉండగా.. భవనంతో కలిపితే రూ.25లక్షల మేర నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు అయితే, జిల్లా గ్రంథాలయ భవనం కూలగా, పక్కనే ఉన్న కేంద్ర గ్రంథాలయ భవనానికి సైతం పలుచోట్ల పగుళ్లు వచ్చాయి. ఘటన జరిగినప్పుడు ఈ భవనంలో వంద మంది పాఠకులు ఉండగా ఆందోళనతో వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ భవనానికి కూడా తాళాలు వేసి ఎవరూ రాకుండా పోలీసు పహారా ఏర్పాటుచేశారు.

కూలితేనే పట్టించుకుంటారా?! 10లో



శిథిలాల తొలగింపును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్

క్లుప్తంగా

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఎల్.కిరణ్‌కుమార్


ఎల్.కిరణ్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం : ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న బి.కిరణ్‌కుమార్ ఆ విధుల నుంచి వ్యక్తిగత కారణాలతో తప్పుకున్నారు. దీంతో డిప్యూటీ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ మేరకు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఎంసీహెచ్‌ట పర్యవేక్షణకు పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ బాబు రత్నాకర్‌ను సూపరింటెండెంట్‌గా నియమించడంతో పాటు ఆస్పత్రి ఆర్ఎంఓ బి.రాంబాబుకు ఎంసీహెచ్‌కు నోడల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

టీ.టీ. క్రీడాకారిణికి అభినందన


నిరీక్షణను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ శిక్షణ పొందుతున్న ఎం.నిరీక్షణ అండర్–19 జూనియర్ కళాశాలల జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 15నుంచి 19 తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈసందర్భంగా డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాలసాని విజయ్, కార్యదర్శి, కోచ్ ఓలేటి సాంబమూర్తి నిరీక్షణను అభినందించారు.

న్యూ గ్రాడ్యుయేట్స్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ న్యూ గ్రాడ్యుయేట్స్ జేఏసీ రాష్ట్ర నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఖమ్మంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడిగా వడిగ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నాళ్ల భానుచందర్, కోశాధికారిగా తేరాల సాధన, ఉపాధ్యక్షులుగా పులి నాగరాజు, జాయింట్ సెక్రటరీగా వడిగ రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా మోదుగు గోవింద రావు, జె.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వచ్చే నెల 6వ తేదీలోగా పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

మీడియా పేరిట డబ్బు వసూలు

నేలకొండపల్లి: మీడియా పేరిట వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఎరువుల దుకాణం యజమాని నుంచి డబ్బులు దండుకున్నారు. మండలంలోని చెరువుమాధారానికి చెందిన ఎరువుల వ్యాపారి శ్రీనివాస్ దగ్గరకు శుక్రవారం ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు. అప్పుడే ఆయన బ్యాంకుకు వెళ్లేందుకు షాప్ మూసివేస్తుండగా రికార్డులు చూడాలని దబాయించారు. అంతేకాక తమ సమావేశం నిర్వహణకు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి సదరు వ్యాపారి నిరాకరించడంతో అనవసరంగా గొడవ చేస్తే నష్టమంటూ బెదిరించడంతో వ్యాపారి రూ.2 వేలు ఇవ్వగా వారు జారుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నందున పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

వైద్యం కోసం వచ్చి మృతి

నేలకొండపల్లి: అనారోగ్యంగా ఉందని ఆస్పత్రికి వచ్చి వైద్యాధికారి గదిలోకి వెళ్తుండగా కుప్పకూలాడు. ఆతర్వాత ఖమ్మం తరలిస్తుండుగా మార్గమధ్యలో మృతి చెందాడు. నేలకొండపల్లికి చెందిన ఏటుకూరి ముత్యాలరావు (30) శుక్రవారం కడుపులో నొప్పి ఉందంటూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అక్కడి కలిసిన వారితో మాట్లాడి వైద్యాధికారి గది వద్దకు వెళ్లగానే కుప్పకూలాడు. దీంతో డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీపీఆర్ చేసినా పరిస్థితి విషమించడంతో 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

కారేపల్లి: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మండలంలోని గుంపెళ్లగూడెంకు చెందిన బాదావత్ కృష్ణ (30) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుండగా ఎక్కడ చికిత్స చేయించుకున్నా ఫలితం కానరాలేదు. దీంతో ఈనెల 5న ఆయన పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న కృష్ణ శుక్రవారం మృతి చెందగా కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నాగరాజకుమారి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

కూలితేనే పట్టించుకుంటారా?!

కేఎంసీ పరిధిలో భయపెడుతున్న శిథిల భవనాలు

- జిల్లా గ్రంథాలయ భవనం కూలడంతో నగరవాసుల్లో ఆందోళన
- లైబ్రరీ కూలేదశకు చేరినా గుర్తించని అధికారులు
- శిథిల భవనాల్లో ప్రభుత్వానివే ఎక్కువగా ఉన్నట్లు అంచనా


శిథిలావస్థకు చేరిన పాత డీఆర్‌డీఏ భవనం వెనుక భాగం (ఇన్‌సెట్) గోడలపై పెరిగిన చెట్లు


శిథిలావస్థకు చేరిన పాత కార్పొరేషన్ కార్యాలయ భవనం

ఖమ్మంమయూరిసెంటర్: దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ భవనాల బీటలు బారి, పెచ్చులు ఊడి, పిల్లర్లలోని ఇనుప రాడ్లు తుప్పు వచ్చి ఆందోళన కలిగిస్తున్నాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలని అధికారయంత్రాంగం నిర్ణయం తీసుకున్నా ఆచరణరూపం దాల్చడం లేదు. ఎప్పుడో ఒకసారి ఒకటి, రెండు భవనాలను తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేయడమే తప్ప పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాల యజమానులకు నోటీసులు ఇస్తున్నా ఆపై చర్యలు తీసుకోవడం లేదు. ఇక శిథిలమైన భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలవి ఉన్నా తొలగించడంలో యంత్రాంగం, ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే...

ఖమ్మం నగరంలో నిర్మించిన అనేక ప్రభుత్వ కార్యాలయాల భవనాలతో పాటు ప్రైవేట్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలిపోతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొనగా... ఇలాంటివి గుర్తించాలని ఏడాది క్రితం టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. అయితే వీరు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా తమ దృష్టికి వచ్చిన వాటి వివరాలతో జాబితా రూపొందించారు. నగరంలో అధికారిక లెక్కల ప్రకారం 120 శిథిల భవనాలు ఉండగా.. వీటిలో అనేకం ప్రైవేట్ వ్యక్తులవే ఉన్నాయి. ఇందులో కొన్నింటిని ఇప్పటికే తొలగించగా.. మరికొన్నింటికి మరమత్తు చేయించాలని ఆదేశించారు. ఆపై ప్రభుత్వ భవనాలను మాత్రం అధికారులు కనీసం పట్టించుకోలేదు. అధికారులు రూపొందించిన శిథిలావస్థ భవనాల జాబితాలో తాజాగా కూలిపోయిన గ్రంథాలయ సంస్థ పాత భవనం కూడా లేకపోవడం గమనార్హం. ఇక రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న పోస్టాఫీస్ పూర్తిగా శిథిలావస్థకు చేరినా అధికారులు తొలగించే ప్రయత్నం చేయలేదు.


శిథిలావస్థకు చేరిన పాత పోస్టాఫీస్ కార్యాలయంపై చెట్లు


పాత బస్టాండ్‌కు ఆనుకుని ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్

నోటీసులతోనే సరి..

శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న భవనాలు, గోడలను తొలగించాలని ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో హడావిడి చేసిన అధికార యంత్రాంగం పూర్తిగా శిథిలమై, భవనాలపై మొక్కలు, చెట్లు పెరిగిన వాటిని గుర్తించి నోటీసులు జారీ చేశారు. వీటిని తక్షణమే తొలగించాలని ఆదేశించినా అధికారులు జాప్యం వహిస్తున్నారు. ఫలితంగా ఇప్పుడు గ్రంథాలయ సంస్థ భవనం కూలిపోగా... ఎప్పుడు, ఎక్కడ ఏం జరుగుతోందనని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ భవనాల పరిస్థితేంటి?

ప్రైవేట్ భవనాల యజమానులకు నోటీసులు ఇస్తున్న అధికారులు ప్రభుత్వ భవనాల వైపు చూడడం లేదు. పోస్టాఫీస్‌కు ఆనుకుని ఉన్న భవనం పూర్తిగా శిథిలమైంది. ఈ భవనం చుట్టూ చిరువ్యాపారులు డబ్బాలు ఏర్పాటుచేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. కేఎంసీ పాత భవనం, మెప్మా కార్యాలయం, డీఆర్‌డీఏ భవనం, సంక్షేమ వసతిగృహాలు, అంబేద్కర్ భవనం తదితర భవనాలు శిథిలమయ్యాయి. మరికొన్ని కార్యాలయాల గదులు శిథిలావస్థకు చేరాయి. జెడ్పీ సెంటర్ సమీపాన ఓ ప్రభుత్వ పాఠశాల భవనం కూడా అదే పరిస్థితిలో ఉంది. నా అధికారులు స్పందించి ప్రభుత్వ శాఖల భవనాల్లో శిథిలమైన వాటిని కూల్చివేసి, ప్రైవేట్ భవనాలపైనా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

- లైబ్రరీ భవనం కూలిన నేపథ్యాన అధికారులు స్పందించి శిథిలమైన మెప్మా కార్యాలయంలోని సామగ్రిని సాయంత్రం కేఎంసీ తరలించారు.

చెరువులో బయటపడిన పురాతన విగ్రహాలు


బైరవునిపల్లిలో చెరువులో దొరికిన విగ్రహాలు

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో ఇటీవల చెరువు మట్టి పూడిక తీస్తుండుగా పురాతన విగ్రహాలు బయటపడ్డాయి. చెరువులో జేసీబీతో పూడిక పనులు చేస్తుండుగా రెండు పురాతన విగ్రహాలను గుర్తించారు. రాతిబండపై చెక్కిన ఆంజనేయస్వామి, విఘ్నేశ్వరుడు రూపంలోని ఈ విగ్రహాలను చెరువు సమీపాన పల్లె ప్రకృతి వనం వద్ద ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పూజలు ప్రారంభించారు. కాగా, పురావస్తు శాఖ అధికారులు పరిశీలిస్తే ఇవి ఏ కాలానికి చెందినవో తెలియనుంది. అయితే, దేవతా విగ్రహాలు చెరువులోకి ఎలా వచ్చాయనేది ఎవరికి అంతు పట్టడం లేదు. చెరువు స్థానంలో గతంలో ఊరు, దేవాలయం ఉన్నాయా.. లేక ఎక్కడి నుంచైనా తీసుకొచ్చివేశారా అనేది తేలాల్సి ఉంది.

గాలిపటాలు ఎగురవేసే సమయాన జాగ్రత్తలు తీసుకోండి

ఖమవ్యవసాయం: సంక్రాంతి సందర్భంగా గాలిపటాలు వేసే వారు తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు జారీ చేశారు. విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్న చోట గాలిపటాలను ఎగురవేయొద్దని, విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పడిన పతంగులు తీసే ప్రయత్నం చేయొద్దని తెలిపారు. డాబాలపై విద్యుత్ లైన్లు ఉన్న దగ్గర పతంగులను ఎట్టి పరిస్థితుల్లో ఎగురవేయకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు.

అత్యాచారం, హత్య కేసులో జైళ్ల శాఖ డీఐజీ విచారణ

నిందితుడి పుట్టినతేదీ రికార్డులు పరిశీలన


తల్లాడ తహసీల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ సంపత్

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులను శుక్రవారం జైళ్ల శాఖ వరంగల్ డీఐజీ ఎం.సంపత్ పరిశీలించారు. అన్నారుగూడెంకు చెందిన పులి రామారావు 1996లో బాలికపై హత్యాచారం, హత్య చేశాడు. ఈ కేసులో రామారావు ప్రస్తుతం జైలులో ఉన్నాడు. అయితే, ఘటన జరిగిన సమయాన తన కుమారుడు మైనర్ అయినందున క్షమాభిక్ష ప్రకటించాలని రామారావు తల్లి హైకోర్టును ఆశ్రయించింది. దీంతో రామారావు చదివిన పాఠశాలలో పుట్టిన తేదీ వివరాలు పరిశీలించేందుకు డీఐజీ వచ్చారు. అలాగే, 2012లో తహసీల్ నుంచి కూడా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం జారీ అయిన నేపథ్యాన కార్యాలయానికి కూడా వెళ్లి రికార్డులు పరిశీలించారు. ఆతర్వాత స్థానిక పోలీస్ స్టేషన్‌ను కూడా ఆయన సందర్శించారు.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక


అదనపు కలెక్టర్‌తో విద్యార్థులు, విద్యాశాఖ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు హరియాణాలోని ఫరీదాబాద్‌లో జరిగే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు భద్రాద్రి జిల్లా విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారు. శుక్రవారం వారిని జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు, జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అభినందించి మాట్లాడారు. విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ పబ్లిక్ అవుట్‌రిచ్ ఇన్ అమృత్‌కాల్' ప్రధానాంశంగా ఈ ఫెస్టివల్ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం నుంచి మొత్తం 20 మందిని ఎంపిక చేయగా, అందులో జిల్లా నుంచే ఏడుగురు ఉన్నారని పేర్కొన్నారు. సైన్స్ ఫెస్టివల్‌కు జాతీయ, అంతర్జాతీయ ఇన్నోవేటర్లు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. వారు విద్యార్థులతో ఇంటరాక్ట్ అవుతారని, కొత్త ఆవిష్కరణలు, పరిశోధనాంశాలు, జాయ్‌ఫుల్ లెర్నింగ్, శాస్త్రం పట్ల అవగాహన తదితర అంశాలు చర్చించే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులతోపాటు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు, ఇల్లెందు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఎం.పార్వతి హాజరవుతారని వివరించారు.

గేదెలను తప్పించే క్రమంలో ప్రమాదం

ఐదుగురు వాహనదారులకు గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో, స్కూటీ

నేలకొండపల్లి: రోడ్డుపై వస్తున్న గేదెలను తప్పించే క్రమంలో ఆటో, స్కూటీ ఢీకొనగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కోదాడ నుంచి నేలకొండపల్లి వైపు శుక్రవారం ఆటో వస్తుంది. మండలంలోని పైనంపల్లి వద్ద గేదెలు రోడ్డుపైకి రావడంతో ఆటోడ్రైవర్ పక్క నుంచి వెళ్లేందుకు యత్నించాడు. ఇదే సమయాన నేలకొండపల్లి నుంచి కోదాడ వైపునకు స్కూటీపై వెళ్తున్న సత్యనారాయణ సైతం గేదెలను తప్పించే ఢీకొనగా ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో సూర్యాపేట జిల్లా తురకగూడెంకు చెందిన రామయ్య, శౌరి, నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెంకు చెందిన షేక్ షాదీ, ఆటోడ్రైవర్ అచ్చిరెడ్డితో పాటు స్కూటీపై వస్తున్న సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే, 108 వాహనం రావడంలో ఆలస్యం జరగడంతో జాతీయ రహదారి నిర్మాణ సంస్థ అధికారులు తమ వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

12కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మం క్రైం: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు 12కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం ఏఈఎస్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యాన వరంగల్ క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్ల వద్ద తనిఖీలు చేశారు. ఈసందర్భంగా చెన్నైకి చెందిన భోజరాజన్, నరేష్ వద్ద ఎనిమిది కేజీలు, భద్రాచలానికి చెందిన చల్ల ఉపేందర్ వద్ద నాలుగు కేజీల ఎండు గంజాయి లభించిందని ఖమ్మం ఎక్సైజ్–2 సీఐ రాజిరెడ్డి తెలిపారు. ఈ గంజాయి విలువ రూ.3లక్షలు ఉండగా నిందితులను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ వీరేందర్, ఎస్సైలు అచ్చారావు, ఎం.సరిత, ఉద్యోగులు నాయక్, వలరాజ్, లాజర్, నాగేశ్వరావు, రాములు, మాలంకార్, రాధ, సురేందర్, గురుప్రసాద్, విశ్వనాథ్, నరేష్ నర్సింహారావు పాల్గొన్నారు.

నాయకన్‌గూడెంలో మూడు కిలోలు?

నేలకొండపల్లి: గంజాయి తరలిస్తున్న యువకుడిని శుక్రవారం నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. భద్రాద్రి జిల్లాకు చెందిన ఓ యువకుడు శుక్రవారం గంజాయితో వస్తున్నాడని సమాచారం అందగా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం వద్ద మాటు వేశారు. ఈమేరకు యువకుడిని అదుపులోకి తీసుకుని మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై సీఐ కుమ్మరి పోశెట్టి వివరణ కోసం యత్నించగా అందుబాటులోకి రాలేదు.

కలెక్టర్, సీపీని కలిసిన ఎమ్మెల్యే రాగమయి


సీపీ సునీత్‌దత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే దంపతులు

సత్తుపల్లి: కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌ను ఖమ్మంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి – దయానంద్ దంపతులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, కలెక్టర్‌కు నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించిన ఎమ్మెల్యే పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

ఆటోను ఢీకొట్టిన కారు


ప్రమాదానికి కారణమైన కారు


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా – జూలూరుపాడు మధ్య శుక్రవారం రాత్రి ఆటోని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దంపతులతోపాటు వారి ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన వీరబాబు తన ఆటోలో భార్య విజయశ్రీ, ఇద్దరు పిల్లలతో మణుగూరు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాయిరాంతండా గ్రామం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయశ్రీకి చెయ్యి విరగగా వీరబాబు తలకు గాయమైంది. ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, కారు నడుపుతున్న డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్నవారంతా ఘటనాస్థలం నుంచి పారిపోయారు. ప్రమాదానికి కారణమైన కారు జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంనకు చెందినదని తెలిసింది. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆటోని కారు ఎదురుగా వచ్చి ఢీకొన్నదా? లేదా వెనుక నుంచి ఢీకొట్టిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అటుగా వెళ్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఘటనా స్థలం వద్ద ఆగి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

మట్టి తవ్వకాలపై డ్రోన్ సర్వే

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని పలు క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరిగాయనే ఫిర్యాదులతో హైదరాబాద్ నుండి వచ్చిన మైనింగ్ శాఖ అధికారుల బృందం శుక్రవారం సర్వే చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయాన మండలంలో మట్టి కుంభకోణం జరిగిందంటూ పువ్వాడ అజయ్‌కుమార్‌పై తుమ్మల నాగేశ్వరరావు విమర్శలు చేశారు. అయితే, తనకు సంబంధం లేదని, జాతీయ రహదారి పనులను మట్టి వినియోగించారని పువ్వాడ బదులిచ్చారు. ఇంతలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, అధికారుల ఆదేశాలతో మట్టి తవ్వకాలు కొద్దిరోజులుగా నిలిచిపోయాయి. ఈనేపథ్యాన హైదరాబాద్ మైనింగ్ శాఖకు చెందిన రామలింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఖమ్మం ఆర్ఐ రాజారెడ్డి, సర్వేయర్ వెంకటేశ్వర్లు తదితరులు జింకలతండా, పువ్వాడనగర్, చింతగుర్తి రెవెన్యూలో పరిధిలోని గుట్టల వద్ద డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేస్తూ వివరాలు సేకరించారు.

పెద్దాస్పత్రిలో ఉరి వేసుకుని ఆత్మహత్య


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి(40) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆస్పత్రి ప్రాంగణంలోని మార్చురీ పక్కన మామిడి తోటలో శుక్రవారం ఉదయం చెట్టుకు వేలాడుతున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన పలువురు సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, మాజీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రాంబాబు, అమర్‌సింగ్ చేరుకుని ఖమ్మం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వారు పరిశీలించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సదరు వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 87126 59110 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ


గంగారంలో డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం రింగ్ సెంటర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఓ లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. రాజమండ్రి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ రింగ్ సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో అదుపు తప్పింది. ఈ ఘటనలో లారీ దెబ్బతినగా ఎవరికీ గాయాలు కాలేదు.

అదుపుతప్పి పొదల్లోకి దుసుకెళ్లిన కారు


చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

ఇల్లెందురూరల్: మండలంలోని లలితాపురం గ్రామం వద్ద శుక్రవారం ఓ కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన రాంబాబు ఇల్లెందు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో రాంబాబు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

యావజ్జీవం తప్పదు!



ఏ లెక్కన చూసినా శిక్ష నుంచి చంద్రబాబు తప్పించుకోలేరు

- చుట్టుముట్టిన స్కిల్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఐఆర్ఆర్, లిక్కర్, ఇసుక స్కాంలు
- అన్ని కుంభకోణాల ప్రధాన కుట్రదారు, లబ్ధిదారు ఆయనే
- సెక్షన్ 409 కింద ఒక్కో కేసులో యావజ్జీవ ఖైదుకు అవకాశం
- అవినీతి నిరోధక చట్టం కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు
- అయినా ముందస్తు బెయిల్‌ను వక్రీకరిస్తున్న ఎల్లో మీడియా

ఆరు కేసుల్లోనూ శిక్ష తప్పదు

చంద్రబాబుపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఎ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటిలో అత్యంత కీలకమైనవది సెక్షన్ 409. ఆ సెక్షన్ కింద నేరం నిరూపితమైతే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. అవినీతి నిరోధక చట్టంలోని 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద నేరం నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఇతర సెక్షన్లు సరేసరి. ఈ ఆరు కేసుల్లో తీర్పులు వేర్వేరుగా వస్తాయి. నేరం నిరూపితమై శిక్షలు పడితే చంద్రబాబు వేర్వేరుగా శిక్షలు అనుభవించాల్సి వస్తుంది. ఇప్పటికే చంద్రబాబుకు 73 ఏళ్లు నిండుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓసారి నేరం నిరూపితమై ఒక్కో కేసులో ఐపీసీ 409 సెక్షన్ కింద యావజ్జీవ కారాగార శిక్ష, అవినీతి నిరోధక చట్టం 13(2) కింద గరిష్టంగా పదేళ్ల కారాగార శిక్ష పడితే తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూముల కేసుల్లో లోకేశ్ కూడా నిందితుడిగా ఉన్నారు. నారాయణతోపాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన వారు కూడా ఉన్నారు. వారంతా శిక్ష అనుభవించాల్సిందేనని నిపుణులు తేల్చి చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ అవినీతికి పాల్పడిన కేసుల్లో హర్యానా మాజీ సీఎం ఓమ్ ప్రకాశ్ చౌతాలకు 16 ఏళ్ల తర్వాత జైలు శిక్ష పడిన ఉదంతాన్ని ఉదాహరిస్తున్నారు. తాజాగా తమిళనాడులో మంత్రిగా చేసిన సెంథిల్ బాలాజీ, మద్యం కేసుల్లో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఇప్పటికీ బెయిల్ రాకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు.

'చంద్రబాబు శాశ్వతంగా జైలు పక్షిగా మారక తప్పదు. ఒకట్రెండ్రోజులు ఆలస్యం కావచ్చు తప్ప, యావజ్జీవ కారాగార శిక్ష మాత్రం పక్కా'అని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఐపీసీ 409 సెక్షన్ కింద ఒక్కో కేసులో విడివిడిగా యావజ్జీవ కారాగార శిక్ష, పీసీ యాక్ట్ 13(బి) కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో బరితెగించి నిబంధనలను ఉల్లంఘించి, యథేచ్ఛగా అవినీతికి పాల్పడిన చంద్రబాబు బాగోతం కట్టలు కట్టలుగా బయట పడుతోంది. భారీ అవినీతి కుంభకోణాల కుట్రదారు, లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబం, సన్నిహితులు, బినామీలేనని డాక్యుమెంటరీ ఆధారాలు, న్యాయ స్థానాల్లో నమోదు చేసిన కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుపై అభియోగాలతో ఏకీభవిస్తూ ఏసీబీ న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించడాన్ని బట్టి చూస్తుంటే.. ఈ ఒక్క కేసు చాలు చంద్రబాబుకు యావజ్జీవ శిక్ష పడటానికి అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. స్కిల్ స్కామ్ కేసులో బెయిల్ ఇస్తున్నప్పుడు గానీ.. తాజాగా మూడు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ సందర్భంగా గానీ చంద్రబాబు అవినీతి చేయలేదని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్కిల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాలకు కర్త, కర్మ, క్రియ గత ముఖ్యమంత్రి చంద్రబాబే అని సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతో వెల్లడి కావడంతో ఆయనకు ఏ రకంగా చూసినా జీవిత ఖైదు తప్పదని న్యాయ నిపుణులు బల్ల గుద్ది చెబుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే ఆయన సర్వం తానై కుట్ర పన్నారు. అందుకోసం కేబినెట్‌కు తెలియకుండా చీకటి జీవోలు జారీ చేశారు. స్కిల్ ప్రాజెక్ట్, ఫైబర్ నెట్, బినామీల పేరుతో అసైన్డ్ భూములు పొందిన వారికి భూ సమీకరణ ప్యాకేజీ, మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ పన్ను.. జీఎస్టీ ఎత్తివేత, ఉచిత ఇసుక విధానం.. ఇలా అన్ని కుంభకోణాలకు మార్గం సుగమం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం వేర్వేరు జీవోలను జారీ చేసింది. ఆ జీవోకు కూడా కేబినెట్ ఆమోదం లేకపోవడం చంద్రబాబు కుట్రను వెల్లడిస్తోంది. ఆ జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను కూడా మాయం చేయడం గమనార్హం. మాయం చేసిన నోట్ ఫైళ్లను సీఐడీ అధికారులు రిట్రీవ్ చేసి వెలుగులోకి తేవడంతో అన్ని కుంభకోణాల కుట్రలకు కీలక ఆధారాలు లభించాయి. చంద్రబాబు ముఠా గల్లంతు చేసిన అమరావతిలో అసైన్డ్ భూముల రికార్డులను సీఐడీ వెలికి తీసింది. స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్‌లలో కొల్లగొట్టిన నిధులు చంద్రబాబు నివాసానికే చేర్చిన అవినీతి నెట్‌వర్క్‌ను బ్యాంకు ఖాతాల వివరాలతోసహా ఛేదించింది. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పులు, క్విడ్ ప్రో కో కింద చంద్రబాబు కరకట్ట నివాసం పొందడం, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు దక్కడం, చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట భూ సమీకరణ ప్యాకేజీ పొందడం మొదలైనవన్నీ రికార్డులతో సహా వెలుగులోకి వచ్చాయి. ఈ విధంగా చంద్రబాబు, లోకేశ్, నారాయణల పాత్రను స్పష్టం చేస్తూ పూర్తి డాక్యుమెంటరీ ఆధారాలు లభించాయి. మరోవైపు ఈ కుంభకోణాలంటికీ సూత్రధారి చంద్రబాబే అని కీలక సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. అది కూడా 164 సీఆర్‌సీపీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయడం చట్ట విరుద్ధమని చెప్పినప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదని అప్పటి సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్ వాంగ్మూలాలు ఇచ్చారు. ఫైబర్‌నెట్, స్కిల్ స్కామ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు మంజూరు చేయొద్దని చెప్పినా చంద్రబాబు పట్టించుకోలేదని కీలక అధికారుల వాంగ్మూలాలు నమోదు చేశారు. షెల్ కంపెనీల ప్రతినిధులు కూడా అప్రూవర్‌గా మారి అదే విషయాన్ని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో కన్సల్టెన్సీ కంపెనీ, స్కిల్ స్కామ్‌కు సంబంధించి సీమెన్స్ కంపెనీ కూడా 164 సీఆర్‌సీపీ కింద వాంగ్మూలాలు నమోదు చేశాయి. అన్ని కుంభకోణాల్లో చంద్రబాబు ప్రధాన కుట్రదారు, ప్రధాన లబ్ధిదారు అనేదానికి అటు డాక్యుమెంటరీ ఆధారాలు, ఇటు కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి.

రిమాండ్‌కు పంపడమే తార్కాణం

చంద్రబాబు పాల్పడ్డ ఇన్ని కుంభకోణాలలో ఒక్క స్కిల్ స్కామ్‌ను పరిశీలిస్తే చాలు.. ఆయన అవినీతి బాగోతం తెలిసిపోతోంది. సీఐడీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చంద్రబాబును అరెస్ట్ చేసిన అనంతరం విజయవాడ ఏసీబీ న్యాయ స్థానంలో హాజరు పరిచింది. ఆ సందర్భంగా దాదాపు 10 గంటలపాటు ఇరుపక్షాల వాదనలను విన్న తర్వాత ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దాంతోనే చంద్రబాబు 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం అనారోగ్య కారణాలతోనే ఆయనకు బెయిల్ మంజూరు చేశారు.

ముందస్తు బెయిల్‌పై ఎల్లో మీడియా వక్రీకరణ

ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాల కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ ఆ సందర్భంగా కూడా ఆయన అవినీతికి ఆధారాలు లేవని న్యాయస్థానం చెప్ప లేదు. కేసు పూర్వాపరాల్లోకి ఇంకా తాము వెళ్లడం లేదని కూడా స్పష్టం చేసింది. కేవలం షరతులతోనే ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. విచారణకు చంద్రబాబు సహకరించాలని.. విచారణకు పిలిస్తే వెళ్లాలని కూడా చెప్పింది. కానీ హైకోర్టు తీర్పుకు వక్రభాష్యం చెబుతూ చంద్రబాబుకు క్లీన్ చిట్ లభించినట్టుగా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా హడావుడి చేయడం విస్మయ పరుస్తోంది. సీఐడీ సేకరించిన ఆధారాలతో నేరం రుజువు కావడం ఖాయమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నేరం నిరూపితమైన తర్వాత ఒక్కో కేసులో చంద్రబాబుకు యావజ్జీవ జైలు శిక్ష పడుతుందని కూడా తేల్చి చెబుతున్నారు.

'స్కిల్డ్' క్రిమినల్ చంద్రబాబే..!

స్కిల్ స్కామ్ కుట్రదారు, లబ్ధిదారు ఆయనే

- సీమెన్స్ ముసుగులో ప్రజాధనం లూటీ
- జర్మనీ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్టు
- రూ.370 కోట్ల ప్రాజెక్ట్ ఏకంగా రూ.3,300 కోట్లకు పెంపు
- తన ముఠాను మోహరించి నిధుల స్వాహా
- అధికారుల అభ్యంతరాలు బేఖాతరు చేస్తూ నిధుల విడుదల

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పై కేసుల్లో నిందితులు వీరే

- నారా చంద్రబాబునాయుడు
- నారా లోకేశ్
- పొంగూరు నారాయణ
- కింజరాపు అచ్చెన్నాయుడు
- దేవినేని ఉమామహేశ్వరరావు
- కొల్లు రవీంద్ర
- పీతల సుజాత
- చింతమనేని ప్రభాకర్

చంద్రబాబు, లోకేశ్ దొంగలు



చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టిన రంగారావు

- కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారు
- ఎన్నికల ముందు మేమే రూ.150 కోట్లు ఇచ్చాం
- టీడీపీ 75 శాతం పూర్తి చేసిందనేది పచ్చి అబద్ధం
- ఆ పార్టీ ప్రజల కోసం కాదు... కుటుంబం కోసమే
- లోకేశ్ రాయలసీమలో ఎందుకు పోటీ చెయ్యడు?
- ఈ పార్టీలో ఉండలేను... రాజీనామా చేస్తున్నా
- చంద్రబాబు ఫొటో నేలకేసి కొట్టిన రాయపాటి రంగారావు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేశ్ దొంగలని, ఆ పార్టీ ఓ దిక్కుమాలిన పార్టీ అని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాయపాటి రంగారావు చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్ ధన దాహానికి తమ కుటుంబం సర్వనాశనం అయిపోయిందని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌కు డబ్బే ముఖ్యమని, మరేమీ అవసరం లేదని అన్నారు. ఇక టీడీపీలో ఉండలేనని స్పష్టం చేశారు. పార్టీకీ, పదవికి రాజీనామా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ వెంటనే తన కార్యాలయంలో ఉన్న చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరిన తాము ఆ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. గత ఎన్నికలకు ముందు తమ నుంచి రూ. 150 కోట్లు తీసుకున్నారని తెలిపారు. లోకేశ్, చంద్రబాబునాయుడు ఎంతెంత తీసుకున్నారో తమ వద్ద లెక్కలున్నాయన్నారు. తండ్రి, కొడుకు ఒకరికి తెలియకుండా మరొకరు డబ్బులు తీసుకున్నారన్నారు. డబ్బులు తీసుకుని కూడా పోలవరం ప్రాజెక్టు విషయంలో తమను సర్వ నాశనం చేశారన్నారు. చంద్రబాబు కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారని చెప్పారు. సోమవారం పోలవారం అని చంద్రబాబు చెప్పడం ఉత్త బోగస్ అని అన్నారు. చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరంపై సమీక్ష చేసింది కేవలం లంచాల కోసమేనని చెప్పారు. ప్రతి వారం డబ్బులు వసూలు చేశారని తెలిపారు. తమని హింసించి మరీ డబ్బులు వసూలు చేశారన్నారు. తమ ఆస్తులన్నీ బ్యాంకులో పెట్టుకున్నారని అన్నారు. డబ్బులు వాడుకుని మూడు సంవత్సరాల తర్వాత మమ్మల్ని ప్రాజెక్టు నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి చేసినట్లుగా చంద్రబాబు చెబుతున్నది పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు.

టీడీపీ ఫక్తు వ్యాపార సంస్థ

తెలుగుదేశం రాజకీయ పార్టీయే కాదని, ఫక్తు వ్యాపార సంస్థ అని ఆరోపించారు. ఆ పార్టీ ఉంది ప్రజల కోసం కాదని, కేవలం వాళ్లు బాగుపడటం కోసమేనని చెప్పారు. లక్ష ఉద్యోగాలు తెచ్చామని, శ్రీసిటీ కట్టించామన్నారని, కియా కంపెనీ తెచ్చామని చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. కియా కంపెనీ తెస్తే అనంతపురంలో ఎందుకు ఓడిపోయారని అన్నారు. లోకేశ్ రాయలసీమలో కాకుండా మంగళగిరి ఎందుకొచ్చాడని ప్రశ్నించారు. లోకేశ్‌కు ధైర్యం ఉంటే రాయలసీమలో పోటీ చేయాలని సవాల్ చేశారు. మంగళగిరిలో లోకేశ్‌ను ఓడిస్తానని చెప్పారు. తమ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉందని, ఎవరినీ మోసం చేయలేదని తెలిపారు. తాను సత్తెనపల్లి సీటు అడిగినా, కన్నా లక్ష్మీనారాయణను నియమించారన్నారు. కన్నా నియామకంతో 83 ఏళ్ల తమ తండ్రి రాయపాటి సాంబశివరావు ఆవేదన చెందారన్నారు. 2014లో రాయపాటి సాంబశివరావు ఎంపీగా గెలిచాక కూడా టీడీపీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారని తెలిపారు. తామే కాదని, పార్టీని నమ్ముకున్న అనేకమంది అప్పుల్లో ఉన్నారని తెలిపారు. చనిపోయిన వారికి ఇన్సూరెన్స్ ఇస్తానని డబ్బులు వసూలు చేసిన లోకేశ్ ఎంతమందికి ఇచ్చారని నిలదీశారు. చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్ర ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. రెండు, మూడు లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారని, ఆ డబ్బులు ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదల కోసం పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం పనిచేస్తున్నారని రంగారావు చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని సీఎం జగన్ ఒక సంవత్సరం బడ్జెట్ మొత్తం ఖర్చు పెట్టారని చెప్పారు. ఆ రెండేళ్లు ఆంధ్రప్రదేశ్ జీడీపీ ఎక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ వెబ్‌సైటే చెబుతోందని తెలిపారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయన్నారు. జగన్ అంటే తమకు ఇష్టమని, ఆయన సీటు ఇస్తే పోటీ చేస్తానని చెప్పారు.

జిల్లా వార్తలు

ముగిసిన జెన్‌కో ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ



ట్రోఫీ అందజేస్తున్న జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కళాభారతి క్రీడామైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడాపోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఫుట్‌బాల్ టోర్నీలో కేటీపీఎస్ 5, 6వ దశలు ప్రథమ, కేటీపీఎస్ 7వ దశ ద్వితీయ, కేటీపీపీ తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే, బాల్ బ్యాడ్మింటన్‌లో శ్రీశైలం ప్రథమ, కేటీపీపీ ద్వితీయ, కేటీపీఎస్ 7వ దశ తృతీయ స్థానాల్లో నిలవగా జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య ట్రోఫీలు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉద్యోగులు జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలని తెలిపారు. సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, శ్రీనివాసబాబు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్‌ఆనంద్‌తో పాటు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: మిరప తోటలకు తెగుళ్లు ఆశించి దిగుబడి పడిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న క్రమాన జిల్లాకు వచ్చిన శాస్త్రవేత్తల బృందం పర్యటన శుక్రవారం కూడా కొనసాగింది. కూసుమంచి మండలంలోని గోపాలరావుపేట, ముదిగొండ మండలం యడవల్లి, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులో పలువురు రైతులు సాగు చేసిన మిర్చి తోటలను రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ, కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాతా వరణ మార్పులతో మిర్చిని తెగుళ్లు, చీడపీడలు వ్యాపించి దిగుబడి పడిపోతోందని తెలిపారు. ఈమేరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు సురేష్‌రావు, రవికుమార్, శైలజతో పాటు ఉద్యాన, వ్యవసాయశాఖల డీడీలు వేణుగోపాల్, మోహన్‌రెడ్డి, డీఏఓ విజయనిర్మలతో పాటు ఉద్యోగులు విజయచంద్ర, వాణి, అపర్ణ పాల్గొన్నారు.

మహిళామణులకు మణిహారం



శిక్షణ పూర్తిచేసుకున్న వారితో సేవా సమితి బాధ్యులు

- టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు
- సింగరేణి సేవా సమితి ఆధ్వర్యాన ఉచిత శిక్షణ
- ఆపై ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న అతివలు
- 2003 నుంచి నేటి వరకు 4,278 మందికి శిక్షణ



మహిళలు సిద్ధం చేసిన దుస్తులను పరిశీలిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ద్వారా మహిళలకు వివిధ ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇల్లెందు సింగరేణి ఏరియా పరిధిలో 2003లో సేవాసమితి ఏర్పాటైంది. ఈ సమితి ద్వారా సింగరేణి ప్రభావిత గ్రామాల మహిళలు, యువతులు, ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తుండగా ఉపాధి రంగాల్లో స్థిరపడుతున్నారు. ఇల్లెందు ఏరియా సేవా సమితి ద్వారా జేకే–5 ఓసీ కాలనీ, ఉసిరికాయలపల్లి, పోలంపల్లి, భాగ్యనగర్‌తండా, పూసపల్లి, గుండాల, కాచనపల్లి, మామాకన్ను, ఆళ్లపల్లి, కేసముద్రం, బాలాజీనగర్, సంజయ్‌నగర్, సీఎస్‌పీ బస్తీ, ఇందిరా నగర్, సుభాష్‌నగర్, తిలక్ నగర్, విజయలక్ష్మీనగర్, కొమురారం, రొంపేడు, రాఘబోయినగూడెం, సుదిమళ్ల, కోయగూడెం, ధారపాడు, పెట్రాంచెల్క, కొప్పురాయి, బోడు, లచ్చగూడెం, కిష్టారం, స్టేషన్ తడికెలపూడి తదితర గ్రామాల వారు ఇప్పటివరకు శిక్షణ పొందారు.

ఉచిత శిక్షణ ఇలా...

సింగరేణి సేవా సమితి ద్వారా 2023 సంవత్సరంలో మూడు కేటగిరీలుగా ఐదు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. టైలరింగ్ మూడు బ్యాచ్‌ల్లో 75 మంది, మగ్గంలో 25 మంది, బ్యూటీషియన్‌లో 25 మందికి సుశిక్షితులైన వారి మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడమే కాక ధ్రువపత్రాలు అందజేశారు. ఈ శిక్షణ ఇటీవలే పూర్తికాగా, సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ అధ్యక్షతన సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి రంగాల్లో స్థిరపడాలని సూచించారు.

ఇరవై ఏళ్లలో 4వేలకు మందికి పైగా..

ఇల్లెందు ఏరియాలో సింగరేణి సేవా సమితి 2003లో ఏర్పడింది. గతేడాది వరకు 177 బ్యాచ్‌లుగా 4,278 మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. అలాగే, ఎలక్ట్రీషియన్ విభాగంలో 89 మందికి, రేడియో, టీవీ మెకానిజం, వీడియో, ఫొటోగ్రఫీలో 37 మందికి, టైలరింగ్‌లో 1,269 మంది, శారీ రోలింగ్‌లో 12 మంది, మగ్గం వర్క్‌లో 470 మంది, బ్యూటీషియన్ 371 మంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. అలాగే, కంప్యూటర్ కోర్సుల్లో 236 మంది, కారు డ్రైవింగ్‌లో 348 మంది, ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలకు 1,143 మంది, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో 220 మంది, స్పోకెన్ ఇంగ్లిష్‌లో 11 మంది, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 40మంది శిక్షణ పూర్తిచేసుకోగా.. పలువురు స్వయం ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి చూపిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి...



సింగరేణి సేవా సమితి ద్వారా మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శిక్షణ ఏర్పాటుచేస్తున్నాం. ఆసక్తి ఉన్న వారు శిక్షణ తీసుకుంటే ఉపాధికి అవకాశాలుంటాయి. తద్వారా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవొచ్చు.

– విజయ, సెక్రటరీ, సింగరేణి సేవా సమితి

ఉచిత శిక్షణతో ఉపయోగం...



సింగరేణి సేవా సమితి ద్వారా ఇచ్చినటైలరింగ్ శిక్షణతో మేలు జరుగుతుంది. ఇంటి వద్దే పనిచేసుకుంటూ కుటుంబానికి అండగా నిలవొచ్చు. మాకు సమీపంలోనే ఇచ్చిన ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకున్నాం.

– నీలిమ, ఇల్లెందు

మెళకువలు అవసరం..



ఉచితంగా మగ్గం వర్క్‌లో శిక్షణ ఇస్తున్నారని వచ్చాను. సాధారణంగా కాకుండా నిపుణులతో శిక్షణ ఇప్పించారు. మగ్గం వర్క్ రావడం వల్ల సొంతంగా చీరలకే కాకుండా ఇతరులకు కూడా వర్క్ చేస్తూ ఉపాధి పొందొచ్చు.

– లలిత సాహితీ, ఇల్లెందు

మెరుగైన ఉపాధి మార్గాలు



ఫంక్షన్లు, పండుగల బ్యూటీపార్లర్లకు ఆదరణ బాగుంటుంది. ఈ తరుణాన సింగరేణి సేవాసమితి ద్వారా ఉచితంగా శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం అందజేశారు. బ్యూటీషియన్ ద్వారా మెరుగైన ఉపాధి మార్గాలు ఉండడంతో శిక్షణ తీసుకున్నా.

– పుష్ప, ఇల్లెందు

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న మత్స్యకారులు

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో 'చేపల మేత తయారీ – యాజమాన్య పద్ధతులు' అంశంపై మూడు రోజులుగా మత్స్యకారులకు ఏర్పాటుచేసిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, రాజన్న సిరిసిల్ల, మెదక్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాలకు చెందిన 25 మంది మత్స్యకారులు పాల్గొనగా వీరికి నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు సమావేశంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ జి.ప్రసాద్ పాల్గొని బ్యాంకు పథకాలను వివరించారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, మత్స్య శాస్త్రవేత్తలు రవీందర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో మేటిగా కిష్టారం ఓసీ



కొత్తగూడెం ఏరియాలోని కిష్టారం ఓసీ ముఖచిత్రం

- 83 రోజుల ముందే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పూర్తి
- ఒక్క ప్రమాదం కూడా లేకుండా ఉత్పత్తి చేయడంపై ప్రశంసలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా కిష్టారం ఓసీ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 83 రోజుల ముందుగానే పూర్తిచేసి రికార్డు సృష్టించింది. కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం ఓసీకి యాజమాన్యం ఈ ఏడాది 20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, 83 రోజుల ముందుగానే (ఈనెల 8వ తేదీ నాటికి 132 శాతం) సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది. సింగరేణి చరిత్రలో ఏ ఓసీ కూడా ఇంత ముందుగా ఉత్పత్తి సాధించిన దాఖలాలు లేవు. అధికారుల సూచనలు, ఉద్యోగులు, కార్మికుల కృషితో లక్ష్యసాధనకు ఆర్థిక సంవత్సరం మొదటి నుంచి ప్రణాళికాయుతంగా ముందుకు సాగడంతో ఈ విజయం సాధ్యమైందని చెబుతున్నారు. కాగా, సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఈ ఏడాది 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనేది లక్ష్యం కాగా.. రోజుకు సుమారు 3 లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటివరకు 56.94 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా 51.69 మిలియన్ టన్నులు నమోదైంది. ఆర్థిక సంవత్సరం ముగియనున్న 82 రోజుల్లో 23.31 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. కాగా, ఓసీల్లో 5,05,33,001 టన్నులు, భూగర్భ గనుల్లో 64,10,439 టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైంది.

ప్రమాదరహితంగా లక్ష్యసాధన



కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం ఓసీ వార్షిక లక్ష్యం 20 లక్షల టన్నులను ముందుగానే సాధించింది. ఈ ఏడాది ఒక్క ప్రమాదం కూడా జరగకుండా లక్ష్యాన్ని చేరుకున్నారు. కంపెనీ సూచించిన రక్షణ సూత్రాలను పాటిస్తూ లక్ష్యాన్ని చేరుకున్న అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అభినందనీయులు. మిగిలిన ఏరియాల ఉద్యోగులు కూడా లక్ష్యసాధనకు కృషి చేయాలి.

– ఎం.శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

వారధిగా ఆనకట్ట!



గోదావరిలో నీరు తగ్గుముఖం పట్టడంతో అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వారధిలా ఉపయోగపడుతోంది. అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఆనకట్ట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఆనకట్ట వర్షాకాలంలో నీరు ఉప్పొంగి ప్రవహిస్తూ, శీతాకాలంలో నీరు జాలువారుతూ జలపాతంలా కనిపిస్తుంది. ఇప్పుడు నీరు తగ్గాక వారధిలా ఉపయోగపడుతుండడం విశేషం.

– అశ్వాపురం